క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10.30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

'తోటలో కళాశాల' పుస్తకావిష్కరణ



పుస్తక ఆవిష్కరణ సభలో మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రమేష్

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ విభాగాధిపతిగా విధులు నిర్వహించిన డాక్టర్ ముళ్లపూడి శ్రీనివాసప్రసాద్ రచించిన 'తోటలో కళాశాల' పుస్తకావిష్కరణ ఆదివారం సాయంత్రం పీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్ హాజరై పుస్తక ఆవిష్కరణ చేశారు. విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ సమకాలీన అంశాలు ప్రస్తావిస్తూ రచించిన ఈ పుస్తకం నేటికాలం యువత చదవాలన్నారు. కార్యక్రమంలో పైడా వెంకటేశ్వరరావు, పూర్వపు ప్రిన్సిపాల్ భరతలక్ష్మి, వలవల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

బోట్‌క్లబ్: ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి నెలా చేయూత ఆత్మీయ స్పర్శ కార్యక్రమం ద్వారా పోషకాహార కిట్లు అందిస్తున్నట్లు చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక చేయూత కార్యాలయంలో ప్రాణాంతకర వ్యాధితో బాధపడుతున్న వారికి పోషకార కిట్లు అందించారు. సమాజంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇటువంటి చిన్నారులను మనసున్న ప్రతి ఒక్కరూ అక్కున చేర్చుకోవాలన్నారు. ఉషారాణి పుట్టినరోజు సందర్భంగా ఈ పోషకాహార కిట్లు అందించారన్నారు. సంస్థ సభ్యులు బాషా, నారాయణమూర్తి, పవన్, వీర శివ, విజయ్, సుబ్బారావు పాల్గొన్నారు.


తల్లిదండ్రులను గౌరవించాలి



ఆత్మీయ కలయికలో జిల్లా పరిషత్ రిటైర్డు ఉద్యోగులు

బోట్‌క్లబ్: మనం చేసే ప్రతి పనిని పిల్లలు గమనిస్తూ ఉంటారని జెడ్పీ రిటైర్డు ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు టి.నూకరాలు అన్నారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ పూర్వ ఉద్యోగుల అపూర్వ కలయిక జరిగింది. ఈ సందర్భంగా నూకరాలు మాట్లాడుతూ మనం తల్లిదండ్రులను బాగా చూసుకుంటే మన పిల్లలు మనల్ని బాగా చూస్తారన్నారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమానికి పంపితే మన పరిస్థితి కూడా అంతేనన్నారు. మాజీ ఉద్యోగులు అందరూ అలనాటి తీపి గుర్తులను నెమరవేసుకొని ఎంతో ఉత్సాహంగా గడిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలతో కేక్ కట్ చేయించి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.ఉష, టి.కమలా, కె.భారతి, ఎ.రామప్రియతోపాటు పలువురు పూర్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక సేవలతో గుర్తింపు



మహిళల మెగా గేమ్‌షోను ప్రారంభిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ, కుసుమ

బాలాజీచెరువు: సామాజిక సేవలతో గుర్తింపు వస్తుందని లయన్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక సూర్యకళా మందిరంలో లయన్స్ క్లబ్ కాకినాడచే 500 మంది లయన్స్ మహిళలకు మెగా గేమ్‌షో నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి దాదాపు రూ.5 లక్షల విలువైన బహుమతులు అందజేశారు. మహిళలు సామాజిక సేవలో పురుషులతో సమానంగా పాల్గొనడం ఆనందంగా ఉందని, మహిళలు మరిన్ని క్లబ్‌లు ఏర్పాటు చేయాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. లయన్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, మొదటి ఉప గవర్నర్ ఈశ్వర్‌కుమార్, కోటేశ్వరరావు, దంగేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో బాదం బాలకృష్ణ ల్యాబ్ ఆవరణలో వెరికోస్ వెయిన్స్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని బాలకృష్ణ ప్రారంభించగా, సుమారు 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మంజూలూరి విశ్వేశ్వరరావు, శాస్త్రి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆట.. అభివృద్ధి బాట

- నగరంలో 40 ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు
- క్రీడపై ఆసక్తి చూపుతున్న ప్రజలు



కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



గాంధీనగర్‌లో కాకినాడ స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన వైఎస్సార్ ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు ముఖద్వారం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటల్లో పతకాలు సాధించడం అందరికీ ఆనందమే.. దాని వెనుక కృషి, పట్టుదలతో పాటు సౌకర్యాలూ అవసరమే.. ఇవన్నీ పుష్కలంగా ఉంటే అన్నింటా విజయమే.. అచ్చం అలానే బ్యాడ్మింటన్ క్రీడలో అనేకమంది వివిధ స్థాయిల్లో దూసుకుపోతూ అందరిచే శెభాష్ అనిపించుకుంటున్నారు. కాకినాడ నగరంలో 40 వరకూ బ్యాడ్మింటన్ కోర్టులు ఉన్నాయంటే, ఇక్కడి క్రీడాకారులు ఇస్తున్న ప్రాధాన్యం చెప్పకనే అర్థమవుతోంది. 44 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉన్న స్థలం, నెట్, రెండు నుంచి నాలుగు రాకెట్లు, ఒక కాక్ ఉంటే చాలు బ్యాడ్మింటన్ ఆట ఆడుకోవచ్చు. ఈ క్రీడతో శరీరానికి వ్యాయామంగా ఉంటుంది. ఊపిరితిత్తుల బలం పెరుగుతుంది. కొవ్వు కరుగుతుంది. శరీరం రోజంతా చురుకుగా ఉంటుంది. బ్యాడ్మింటన్ క్రీడతో అటు వ్యాయామంతోపాటు ఇటు పేరు ప్రఖ్యాతలు సొంతం చేసుకోవచ్చు. ప్రభుత్వం నుంచి బ్యాడ్మింటన్ క్రీడాకారులకు, క్రీడకు మంచి ఆదరణ లభిస్తుండడంతో ప్రస్తుత కాలంలో ఈ క్రీడకు నగరంలో ప్రాధాన్యం ఇస్తున్నారు. కాకినాడ నగర, రూరల్ పరిధిలో రమణయ్యపేట, గైగోలుపాడు, సురేష్ నగర్, గాంధీనగర్, రామారావు పేట, టౌన్‌హాల్ మెయిన్‌రోడ్, జగన్నాథపురం, నాగమల్లితోట జంక్షన్, ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో దాదాపు 40 వరకూ ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు ఉన్నాయి. ఇవీ కాక గాంధీపార్కు, వివేకానంద పార్కులలో అవుట్‌డోర్ కోర్టులు అందుబాటులో ఉన్నాయి. వీటన్నింటిలో ఫ్లడ్‌లైట్ల సౌకర్యం కల్పించారు. ఒక్కో స్టేడియంలో రెండు నుంచి ఆరు కోర్టులు అందుబాటులో ఉన్నాయి. జేఎన్‌టీయూఏకేలోని ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులో యూనివర్సిటీ విద్యార్థులు సాధన చేస్తున్నారు. ఇందులో ఆరేళ్ల నుంచి 80 సంవత్సరాల వయసు వారు రోజూ వందలాది మంది బ్యాడ్మింటన్ ఆడుతున్నారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఈ కోర్టుల్లో క్రీడాకారులు ఆడుతున్నారు. సింగిల్స్, డబుల్స్‌లో ఆడే ఈ క్రీడలో ఉమ్మడి జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారుల్లో సాత్విక్ సాయిరాజ్, కృష్ణప్రసాద్ ఉన్నారు. నగరంలో ప్రజల అభిరుచిని గుర్తించి నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ నిధుల నుంచి బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టులను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచనలతో అభివృద్ధి చేసింది.

అవకాశాలు పుష్కలం



బ్యాడ్మింటన్ ఆడడం వల్ల ఆరోగ్యంతో పాటు వ్యాయామంగా ఉంటుంది. 6 సంవత్సరాల నుంచి ఎవరైనా ఆడవచ్చు. కాకినాడ నగరంలో 40 వరకూ ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రీడలో రాణించాలనుకునే వారికి ప్రస్తుత కాలంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వయసు పైబడిన వారు వ్యాయామం కోసం ఇప్పటికే బ్యాడ్మింటన్ ఆడుతున్నారు.

– చిన్నారి, డీఎస్‌ఏ బ్యాడ్మింటన్ కోచ్

శిక్షణ శిబిరాల నిర్వహణ

స్థానిక జిల్లా క్రీడా మైదానంలోని బ్యాడ్మింటన్ కోర్టులో అందరికీ అందుబాటులో ఉండే రుసుంతో ఈ నెల రెండో వారంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాడ్మింటన్‌లో రాణించిన వారికి ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో అవకాశం కల్పిస్తుండడంతో ఎక్కువమంది విద్యార్థులు ఈ క్రీడపై మక్కువ కనబరుస్తున్నారు. నగరంలో ద్రోణాచార్య, కాకినాడ బ్యాడ్మింటన్ అకాడమీ వంటి చోట్ల బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా తీసుకోవాలనుకునే విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. కాకినాడ బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి నగరంలో బ్యాడ్మింటన్ కోర్టుల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కేబీఏ తరఫున పేద క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. కాకినాడకు చెందిన వెటరన్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కర్రి భామిరెడ్డి ఇటీవల 75 ఏళ్ల కేటగిరీలో అంతర్జాతీయ పోటీలలో పాల్గొని యువ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపారు. రానున్న రోజుల్లో ఈ కోర్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని క్రీడాకారులు, క్రీడాభిమానులు చెబుతున్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నీ



విజేతలకు కప్ అందిస్తున్న హరీష్, డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో స్వామి అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా జరుగుతున్న సూపర్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పటంలో దేశ పతాకాన్ని రెపరెపలాడించే లక్ష్యంతో ప్రతి క్రీడాకారుడు మొక్కవోని దీక్షతో కృషి చేయాలన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. టోర్నీ నిర్వాహకుడు, ఫుట్‌బాల్ కోచ్ స్వామి మాట్లాడుతూ ఈ పోటీలలో 8 జట్లు పాల్గొన్నాయన్నారు. విజేతగా స్వామి అండ్ ఫ్రెండ్స్ క్లబ్, రన్నర్‌గా డీఎస్‌ఏ ఫుట్‌బాల్ క్లబ్ నిలిచాయి. విజేతలకు డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, హరీష్‌లు బహుమతులు అందజేశారు.

అసెంబ్లీ స్థానం కేటాయించాలి

బోట్‌క్లబ్: కాకినాడ పార్లమెంట్ స్థానాల్లో ఒక అసెంబ్లీ స్థానాన్ని పొత్తుల్లో బీజేపీకి కేటాయించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్నీడి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి వినతి పత్రం పంపుతున్నట్లు ఆదివారం విలేకర్లకు తెలిపారు.

చరిత్రలో చెప్పుకొనేలా ప్రగతి



కమ్యూనిటీ హాలు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- రూ.9.40 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

కాకినాడ: ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో కాకినాడ నగరాన్ని చరిత్రలో చెప్పుకొనేలా తీర్చిదిద్దామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. దాదాపు అన్ని డివిజన్లలో రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు వంటి సకల సదుపాయాలు కల్పించామన్నారు. ఆదివారం స్థానికంగా రూ. 9.40 కోట్లతో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 9వ డివిజన్‌లో భగీరథ ఆలయం నుంచి మూడుగుళ్ల సెంటర్ వరకూ సీసీ రోడ్డు, 11 డివిజన్‌లో రజక కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపనలు, పదో డివిజన్‌లో రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 13వ డివిజన్‌లో హబీబియా మసీద్ వద్ద కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు, 14వ డివిజన్ ఏటిమొగ తూర్పుపేటలో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణాలు, 17వ డివిజన్‌లో నూతన సచివాలయ భవనం, 23వ డివిజన్ ముగ్గపేటలో శ్మశాన వాటిక మరమ్మతు పనులను ప్రారంభించారు. 24వ డివిజన్ బాపూజీనగర్, ముగ్గుపేట ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్ మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. 39వ డివిజన్‌లో కింతాడ వెంకటరావు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ప్రతి పనిని పూర్తి చేశామన్నారు. ప్రధానంగా సుమారు 30 వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. వీరందరికీ 2026 డిసెంబర్ నాటికల్లా గృహ నిర్మాణాలు కూడా పూర్తి చేసి, సొంతింటి కల సాకారం చేస్తామన్నారు. మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి సంతృప్తికర సేవలు అందించగలిగానన్నారు. ప్రజాప్రతినిధిగా ఇంతకన్నా ఏం కావాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఏఈ వై.నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, రెహ్మాన్ ఖాన్, బాషా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు కాలిద్ బిన్ వలి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకే పాలన



పెనుగుదురులో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

కరప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు పాలన చేరువైందని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఆదివారం పెనుగుదురులో రూ.80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి అధ్యక్షన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనలో దోపిడీ, ప్రస్తుత సీఎం జగన్ పాలన వచ్చాక జరిగిన మంచిని అందరూ తెలుసుకుని వచ్చే ఎన్నికల్లో విజ్ఞతతో ఓటెయ్యాలన్నారు. చంద్రబాబు అండ్ కో మాయ మాటలను నమ్మవద్దన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రతి కుటుంబానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మేలు జరిగిందన్నారు. పథకాలు అమలు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. ఇందుకు గాను ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. అనంతరం 252 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. సర్పంచ్ వెంకటమాధవి మాట్లాడుతూ గ్రామంలో ఈ ఐదేళ్ల కాలంలో రూ 5.20 కోట్లతో సీసీ డ్రెయిన్లు, రోడ్లు, ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి, గ్రామ సచివాలయ భవనం, ఇంటింటికీ కుళాయి వంటి పనులు చేశామన్నారు. మరో రూ.60 లక్షలతో పనులు చేయాల్సి ఉందన్నారు. డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.31.57 కోట్ల సొమ్మును వివిధ పథకాల ద్వారా ప్రజల అకౌంట్లకు నేరుగా జమ చేశామన్నారు. ముందుగా పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్, గ్రామ కార్యదర్శి బి.చంద్రకళ స్వాగతం పలకగా, వార్డు సభ్యుడు తోటకూర శ్రీను వందన సమర్పణ చేశారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, కరప ఏఎంసీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, నాయకులు పెంకే సత్తిబాబు, బండారు వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



సర్పవరం శెట్టిబలిజపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని, అందుకే టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. సర్పవరం గ్రామంలో ఆదివారం సాయంత్రం, రాత్రి రెండు వేర్వేరు చోట్ల జరిగిన కార్యక్రమంలో సుమారు 300 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. శెట్టిబలిజపేటలో కొప్పిశెట్టి శివకుమార్ ఆధ్వర్యంలో రాయుడు గోవిందు, విష్ణు, గంట శ్రీను, పాటి శ్రీను, పోలవరపు సూర్యప్రకాష్, అనిల్, కొప్పిశెట్టి వీరబాబు, సత్తిబాబు, శ్రీలం సత్యనారాయణ, గుత్తుల వినోద్, పాలిక రాజు, అనుసూరి సుబ్రహ్మణ్యం తదితరులు సుమారు రెండు వందల మంది వైఎస్సార్ సీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు వేసి కన్నబాబు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ పేటలో జరిగిన కార్యక్రమంలో రాయి సూరిబాబు ఆధ్వర్యంలో యూత్ సభ్యులు బొర్రా చిట్టిబాబు, ఇంజరపు అప్పలరాజు, బొండాడ పండు, కిశోర్, ఆనంద్, ఇరుగుల ప్రభాకర్, నేమాల ప్రభాకర్, సత్యనారాయణ, ప్రసన్న, రమణ, తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను ఎమ్మెల్యే కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ తదితరులు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పుల్ల కోటేశ్వరరావు, చందు, ప్రభాకరరావు, ఎంపీటీసీలు గుత్తుల శ్రీను, సారా శేఖర్, వసుం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- కాకినాడ అర్బన్ రెండో డివిజన్ కొండేలుపేటకు చెందిన పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. వైఎస్సార్ సీపీ స్మార్ట్ సిటీ కార్యదర్శి మాదబోయిన నేరెళ్ల ఆధ్వర్యంలో రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద కురదాసు భగీరథ, కొండేలు బంగారయ్య, మధు, కొండేలు సింహాద్రి తదితరులు సుమారు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

అంతరించిపోతున్న కళలను బతికించాలి



తోలుబొమ్మలాట శిక్షణకు ఎంపికైన చిన్నారులను సత్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

బోట్‌క్లబ్: అంతరించిపోతున్న కళలను బతికించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక సత్కళావాహినిలో ఆదివారం తోలుబొమ్మలాట కళాకారులకు శిక్షణ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన చిన్నతనంలో టీవీలు ఉండేవి కాదని, అప్పట్లో తోలుబొమ్మలాటకు ఎంతో ఆదరణ ఉండేదన్నారు. గ్రామాల్లో ప్రదర్శన వేస్తే అందరూ వచ్చి తిలకించేవారన్నారు. ఈ కళను బతికించేందుకు కేంద్ర ప్రభుత్వం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ నాటక అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి మాట్లాడుతూ మన సంస్కృతికి నిదర్శనం కళలు అని అన్నారు. మన దేశంలో 64 కళలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏదొక కళను నేర్చుకోవాలన్నారు. జీవితంలో చదువు ఒక్కటే కాకుండా వారికి ఇష్టమైన కళను ఎంచుకుని రాణిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న సత్కళావాహిని తాము అడిగిన వెంటనే ఇక్కడ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒప్పుకున్న కృష్ణమాచార్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తోలుబొమ్మలాట శిక్షణకు అర్హత సాధించిన చిన్నారులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సత్కరించారు.

ఓఎన్జీసీపై ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ

- అఖిలపక్షం తరఫున ఐక్య పోరాటానికి సిద్ధం
- ఎమ్మెల్యే ద్వారంపూడి సహా నేతల సంఘీభావం



ఓఎన్జీసీ అంశంపై ఉమ్మడి ఉద్యమ కార్యాచరణకు సిద్ధమైన అఖిలపక్ష నేతలు

కాకినాడ: కేజీ బేసిన్‌లో ఆయిల్ నిక్షేపాల అన్వేషణ కారణంగా నష్టపోతున్న మత్స్యకారులకు పరిహారం అందించే విషయంలో రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాలని అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. చమురు సంస్థల నిర్వాకం వల్ల నష్టపోతున్న మత్స్యకారులందరికీ న్యాయం జరగాలన్న ఒకే ఒక్క అజెండాతో ముందుకు సాగాలని నిర్ణయించారు. స్థానిక లంగరు రేవు వద్ద ఓఎన్జీసీకి వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న నిరసన శిబిరాన్ని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఆదివారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. తొలుత సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ మత్స్యకారులకు న్యాయం చేసే విషయంలో ఓఎన్జీసీ సంస్థ మీనమేషాలు లెక్కించకుండా వెంటనే పరిహారంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే కేజీ బేసిన్‌లో వెలికి తీసిన నిక్షేపాల్లో రాష్ట్ర వాటా కోసం అసెంబ్లీ వేదికగా గట్టిగా డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్, మత్స్యకార ప్రతినిధులు ఓఎన్జీసీ అధికారులతో సోమవారం జరిగే సమావేశంలో స్పష్టమైన సమాధానం రాకపోతే భవిష్యత్ కార్యాచరణను ఆ వెంటనే ప్రకటిస్తామన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సిసిమిక్ సర్వేను నిలుపుదల చేశామని, ఓఎన్జీసీ దిగి రాకపోతే సముద్రంలోకి వెళ్లి మరీ కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ సమక్షంలో జరిగే చర్చలు ఫలప్రదం కాగలవని ఆశిస్తున్నామని, అలా కానిపక్షంలో సీఎం స్థాయిలో కూడా సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకారులకు న్యాయం జరిగేలా చూస్తానని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా కలసి వచ్చే ప్రతి ఒక్కరిని ఉద్యమంలో భాగస్వాములను చేసి మత్స్యకారులకు న్యాయం జరిగేందుకు శ్రమిస్తామని అన్నారు. ఉప్పాడ నుంచి ఉప్పలంక వరకూ దాదాపు 40 వేల మత్స్యకార కుటుంబాలు నిక్షేపాల వెలికితీత వల్ల నష్టపోతాయని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కె.బోడకొండ, తోకల ప్రసాద్ (సీపీఐ), కాటాడి జానకిరామ్, చక్రవర్తి (వైఎస్సార్ సీపీ), నరాల శివ, జాషువా (ఆమ్‌ఆద్మీ పార్టీ), పిట్టా వరప్రసాద్, సంపత్ కుమార్ (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా), చెక్కా నూకరాజు, కుక్కల పోతురాజు(కాంగ్రెస్), పి.సత్యనారాయణ (బహుజన్ సమాజ్ పార్టీ) తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నం

కాకినాడ: కేజీ బేసిన్‌లో ఆయిల్ నిక్షేపాలకు సంబంధించి మత్స్యకారులకు న్యాయం జరిగేలా ఓఎన్జీసీపై నిబద్ధతతో చేస్తున్న పోరాటాన్ని నీరుగార్చేందుకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొండబాబు ప్రయత్నిస్తున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మత్స్యకారుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకునే వ్యక్తుల విమర్శలకు ఇకపై సమాధానం ఇవ్వబోనని స్పష్టం చేశారు. మత్స్యకారులకు రావాల్సిన సొమ్ము కాజేశానంటూ చేస్తున్న తప్పుడు విమర్శలతో సహా, ఏ ఒక్క ఆరోపణల పైనా ఇకపై సమాధానం ఇవ్వబోనని అన్నారు. రాజకీయ విమర్శలకు మాత్రం దీటుగా బదులిస్తానన్నారు. మత్స్యకారులకు మంచి జరగాలని రాజకీయాలకు అతీతంగా పోరాటం చేస్తుంటే.. తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. మత్స్యకారులు కూడా అటువంటి నాయకుల ట్రాప్‌లో పడకుండా అప్రమత్తంగా ఉండి ఐక్య ఉద్యమంతో సమస్య పరిష్కారం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

పురస్కారాల ప్రదానం

కాకినాడ సిటీ: స్థానిక ఖిద్మత్ కమిటీ ఆత్మీయ సమావేశం వంద మందితో హబీబీయా షాదీఖానాలో కమిటీ అధ్యక్షుడు షేక్ చిస్తి అధ్యక్షతన నిర్వహించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కొందరిని గుర్తించి ఖిద్మత్ గార్ పురస్కారంతో సత్కరించారు. కార్యదర్శి హుస్సేన్, కోశాధికారి గౌస్, ఉపాధ్యక్షుడు అలీం, మాజీ అధ్యక్షుడు హసన్ షరీఫ్, ఏజసుద్దీన్, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, చేయూత చైర్మన్ రవికుమార్ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



వాకలపూడిలో సీఏఎఫ్ రిజర్వు పోలీసులతో కలిసి సర్పవరం పోలీసుల కవాతు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా కాకినాడ రూరల్ మండలం వాకలపూడి, వలసపాకల గ్రామాలతో పాటు కాకినాడ అర్బన్ గుడారిగుంట, శాంతనపురి కాలనీ తదితర చోట్ల సీఏఎఫ్ దళాలతో సర్పవరం పోలీసులు కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు వంద మందితో కలసి కవాతు చేశామని వివరించారు.